క్లుప్తంగా

పశ్చాత్తాప హృదయంతో దేవునికి దగ్గరవ్వాలి



ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్ యువారి ఆంథోనీ

ఆదోని సెంట్రల్: ప్రతిఒక్కరూ పశ్చాత్తాప హృదయంతో దేవునికి దగ్గరవ్వాలని హిందూపురం విచారణ గురువులు రెవరెండ్ (ఎస్.జె. సభ) ఫాదర్ యువారి ఆంథోని అన్నారు. ఆర్‌సీఎం చర్చి మండిగిరిలో రెవరెండ్ ఫాదర్ విచారణ గురువు, డీన్ ఫాదర్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో తపస్సుకాల స్వస్థత, ఆధ్యాత్మిక కూటములు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫాదర్ ఆంథోని మాట్లాడుతూ.. ఈ 46 దినములు ప్రతి ఇంట్లో శాంతి, సమాధానం చాలా అవసరమన్నారు. ఆధ్యాత్మిక శక్తితోనే సర్వం సాధ్యమన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



మాధవర రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాలెం పెద్దమ్మవ్వ దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు గొళ్ల మాధవ రెడ్డి అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్నతో కలిసి ఆయన ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఫోన్ చేసి ఆరోగ్యం విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బుల్లి నరసింహులు, వలంటీర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు ప్రతాప్, వీరారెడ్డి, దోసకాయల ఈరన్న, యూనూస్, రాజ్‌కుమార్ ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆదోని సెంట్రల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ–1 జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎస్‌కేడీ కాలనీలోని భార్గవ్ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం పాఠశాల కరస్పాండెంట్ పావనికుమారి అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ–1 హాజరయ్యారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదోనిలో శోభాయాత్ర

ఆదోని అర్బన్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక మంగళ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా కోట్ల కూడలి, పాత బస్టాండు, ప్రభుత్వ ఆసుపత్రి వరకు శోభాయాత్ర కొనసాగింది. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కోసిగి: మండలంలోని బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు పెండేకల్లు చిన్న రాముడు అన్నారు. ఆదివారం మండల కేంద్రం కోసిగి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదోని రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను వివిధ గ్రామాల కార్యకర్తల సమక్షంలో ఎగరవేశారు. కార్యక్రమంలో నాయకులు మారెన్న, తమ్మారెడ్డి, ఈరమ్మ, కృష్ణ, ఉసేని, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు విశేష పూజలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో తేరుబజారులో వెలసిన ఆంజనేయ స్వామికి భక్తులు విశేష పూజలు చేపట్టారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మార్కండేయ స్వామి ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పంపిణీ చేపట్టారు.



కోసిగిలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



ఎమ్మిగనూరులో స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మున్సిపల్ కమిషనర్ దంపతులు



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



ఎమ్మిగనూరులో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కౌతాళం రాజనగర్ క్యాంపులో పూజలు చేస్తున్న దంపతులు

అంతా రామమయం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కమనీయంగా సీతారాముల కల్యాణోత్సవం
- మార్మోగిన జై శ్రీరామ్ నామస్మరణ

ఆదోని అర్బన్: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఊరూరా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆదోని పట్టణంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించగా.. జై శ్రీరామ్ నామస్మరణతో కళ్యాణ వేదికలు మార్మోగాయి. పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ, హనుమాన్‌లకు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా అయ్యవారు, అమ్మవారి వైపు దంపతులు కూర్చొని కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు.

- పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని చిన్మయ మిషన్‌లో సీతారామ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన చిన్మయ మిషన్ సుబ్రహ్మణ్యం దీక్షితులు భక్తిగీతాలాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక చిన్మయ మిషన్ బ్రహ్మచారి నారాయణ చైతన్య, చిన్మయ మిషన్ అధ్యక్షుడు హెగ్గటి ప్రతాప్, సభ్యులు మోహన్ రెడ్డి, విట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని టీజీఎల్ కాలనీలో శ్రీరామ నవమి సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల చేత పాలాభిషేకం చేయించారు. అనంతరం సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిసేవా సమితి సభ్యులు వీరస్వామి, ప్రసాద్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు పట్టు వస్త్రాల సమర్పణ

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సీతారాములస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో వెలిసిన సీతారాముల ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

- కోసిగి: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో వెలసిన శ్రీరామాలయంలో ఆలయ అర్చకులు పద్మనాభ ఆచార్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు



సోమలగూడూరులో సీతారాములకు కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న దృశ్యం,



కులుమాలలో సీతారాముల కల్యాణం

కమణీయం..సీతారాముల కల్యాణం

నందవరం : దక్షిణ కాశిగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలో భాగంగా జరిగిన సీతారాముల కల్యాణం అత్యంత రమణీయంగా సాగింది. ఆలయంలో పురోహితుడు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం నిర్వహించిన అనంతరం దేవత మూర్తులు శేషవాహనంపై కొలువుతీరి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామి, రాములోరి ఆలయాలు సీతారాముల నామస్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంతో పాటు సోమలగూడూరులో పురోహితులు శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. రాయచోటి శ్రీరాముడి ఆలయం, కొత్తకైరవాడి ఆంజనేయస్వామి, మాచాపురం, గంగవరం, ధర్మపురంలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. జొహరాపురంలో హనుమాన్ ఆలయాల్లో వేడుకలు కనుల పండువగా సాగాయి. ఆయా గ్రామాల్లో ఉత్సవాలు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలోని దేవాలయాలలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగపు అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు ప్రార్థసారథిరెడ్డి, రుక్మానందరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గురజాల శివారెడ్డి, సత్యానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు, సీతమ్మ దంపతులకు వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, మహామంగళ హారుతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదోనికి చెందిన వేదపండితులు భక్తుల మధ్య వేదమంత్రాలు పటిస్తుండగా మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య సీతారాముల కళ్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది.

- కౌతాళం: సీతారాముల కళ్యాణం వేడుకలు (శ్రీరామనవమి వేడుకలు) ఆదివారం మండల కేంద్రమైన కౌతాళంతో పాటు శివారు ప్రాంతం అయిన రాజానగర్ క్యాంపులో, జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో, కుంబళనూరు క్యాంపుల్లో వైభవంగా జరిగాయి. మండల కేంద్రమైన కౌతాళంలోని త్రయంబకేశ్వరస్వామి దేవాలయంలో వేదపండితుల సమక్షంలో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక 17వ వార్డులోని సీతారాముల వారి ఆలయం, వీవర్స్ కాలనీలోని శ్రీసీతారామాంజినేయుల స్వామి, మార్కండేయ, రామస్వామి, ఎస్ఎంటీ కాలనీ వద్ద ఉన్న ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంతవైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సీతారాముల వారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర వీరశైవ లింగాయత్ విభాగం అధ్యక్షుడు రుద్రగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్, కామర్తి నాగేషప్ప, రామాంజినిరెడ్డి, సోమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు.

- గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాలు కులుమాల, చిన్న నేలటూర్, పెద్ద నేలటూర్, అలువాల, ఐరన్‌బండ, వేముగోడు, కైరవాడి, గాజులదిన్నె, గంజిహళ్లి, తిప్పనూరు, కున్నూరు, తదితర గ్రామాల్లో శ్రీరాముల దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోనెగండ్లలో వీరశైవ పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం జరిపించారు. భక్తులకు పానకం, వడపప్పు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహలను స్థానిక అంజినేయ స్వామి దేవాలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గోనెగండ్లలో నిర్వహించిన వేడుకల్లో సీఐ విజయభాస్కర్ దంపతులు పాల్గొని సీతారామ కళ్యాణ వేడుకలను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రాలయంలో సీతారాముల కల్యాణం

మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం పాత ఊరిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణాల మధ్య సీతారాములు, ఆంజనేయ స్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి హారతులు పట్టారు. అభిజిత్ లఘ్న సమయంలో శ్రీ సీతారాములకు అనూరి సునీల్ కుమార్ చార్యులు నేతృత్వంలో కల్యాణం జరిపించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను కలశాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమణయ్య, భీమాచార్యులు, మధుసూదన చార్యులు, సత్యనారాయణ, వెంకటేష్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, కురువ మల్లికార్జున, శివప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు సీతారామాంజినేయ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్రగౌడ్, శివప్రసాద్, కామర్తి నాగేషప్ప తదితరులు

ఉరుకుందలో ఘనంగా వేడుకలు



ఉరుకుందలో కల్యాణ మహోత్సవం

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో నవమి వేడుకలను అర్చకులు వేద పండితుడు ఘనంగా చేపట్టారు. వేదపండితుడు మోహన్ మురళీకృష్ణ శర్మ, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, అర్చకులు పూజలు చేపట్టారు.



మంత్రాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



ఆదోని చిన్మయమిషన్‌లో సీతారామ కల్యాణోత్సవం



కల్యాణోత్సవం వీక్షిస్తున్న భక్తులు,




ఆదోని విక్టోరియాపేటలో సీతారాములకు కల్యాణోత్సవం జరుపుతున్న పండితులు



సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం





పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి, కవిత కల్పవల్లి ఆరేపల్లి పుస్తకాన్ని అవిష్కరిస్తున్న వైద్యం వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి, దేవి, శ్రీదేవిల సమేతంగా కొలువుదీరి భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. ప్రతి సంవత్సరం మండలంలో ఎక్కడా జరగని విధంగా ఈ గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీవారి కల్యాణం, అనంతరం ప్రభోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సీబీ జానకిరామిరెడ్డి, సీబీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీబీ వసుసుందరమ్మ, సీబీ విజయమ్మ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు సత్యనారయణ, శేఖర్‌స్వామి కల్యాణ మహోత్సవం జరిపించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జామున వరకు రథోత్సవం జరుగునుంది. అలాగే దేవాలయం అవరణలో కవిత కల్పవల్లి ఆరేపల్లి వరలక్ష్మమ్మ, వైద్యం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో »సంస్థానం –సాహిత్యం« పుస్తకావిష్కరణ జరిగింది.

క్రికెట్ విజేత ఆదోని బార్ అసోసియేషన్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జడ్జి సుధ

ఆదోని రూరల్: న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదోని బార్ అసోసియేషన్ ఘన విజయం సాధించింది. ఆదివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మైదానంలో ఆదోని, కర్నూలు బార్ అసోసియేషన్‌ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆదోని జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదోని బార్ అసోసియేషన్ 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 80 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. విజేతలకు ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పైపులైన్‌లో 25 అడుగుల వేరు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో తాగునీటి పైపులైన్‌లో 25 అడుగుల వేరును తొలగించటంతో నీటి సమస్య పరిష్కారమైంది. గ్రామానికి కలుగోట్ల గ్రామం వద్ద బోరు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా కుళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి సోగనూరు నుంచి కలుగోట్ల వరకు పైపులను చెక్ చేయిస్తుండగా రెండు గ్రామాల మధ్యలో పైపును తవ్వి చూడగా పెద్ద వేరు ఉండటాన్ని గుర్తించి తొలగించారు. దీంతో నీటి సమస్య తీరింది.



పైపు నుంచి వేరును బయటకు తీస్తున్న దృశ్యం

రుణాలు సకాలంలో చెల్లించండి

ఆదోని అర్బన్: రుణాలు పొందిన ఖాతాదారులు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ అసిస్టెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తల్లమ్ మాధవరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో రూ.262 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, రూ.183 కోట్ల అప్పులు, రూ.6.53 కోట్ల నికర లాభాలు ఉన్నాయన్నారు. రూ.21.26 కోట్ల రిజర్వ్ నిల్వలతో 0.70 శాతం నిరర్థక ఆస్తులు కలిగి ఉందని, 54,764 మంది ఖాతాదారులు తమ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్నారన్నారు. మా బ్యాంకు ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఆస్పరి, ఆలూరు, కోసిగి, హొళగుంద మండలాల్లోని రైతులకు సేవలు అందిస్తోందని చెప్పారు. త్వరలో బ్యాంకు యూపీఐ సదుపాయం, మొబైల్ బ్యాంకు సేవలు, డెబిట్, ఏటీఎం సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎల్ఎల్‌సీ కాలువలో పడి వ్యక్తి మృతి



ముక్కిరయ్య (ఫైల్)

కౌతాళం: కౌతాళం పోలీ స్టేషన్ పరిధిలోని బదినేహాల్ గ్రామంలో ఆదివారం సాయంత్రం తుంగభద్ర దిగువ కాలువలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కోసిగి గ్రామానికి చెందిన పులి ముక్కిరయ్య(30) మండల పరిధిలోని బదినేహాల్ గ్రామానికి చెందిన శశికళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు కాగా.. వీరు వలస వెళ్లి హైదరాబాదులో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం బదినేహాల్ గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాన్ని తిలకించేందుకు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా బదినేహాల్‌కు వచ్చాడు. సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న తుంగభద్ర దిగువ కాలువలో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశత్తు కాలు జారీ నీళ్లల్లో కొట్టుకొని పోయాడు. చుట్టూ పక్కల ఉన్న వారు వచ్చి రక్షించేలోపు నీళ్లల్లో మునిగిపోయాడు. ముక్కిరయ్యను బయటికి తీసి అంబులెన్స్‌లో ఆదోనికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పండుగ పూట గ్రామ అల్లుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

బాలికలకు వరం కేజీబీవీలు



గోనెగండ్ల కేజీబీవీ

- ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైతే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన

గోనెగండ్ల : గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలు, అనాథ బాలికల చదువుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతితో పాటు భోజనంతో కూడిన విద్యను అందిస్తున్నాయి. 2025–26 విద్యాసంవత్సరంలో కేజీబీవీల్లో 6వ తరగతితో పాటు ఇంటర్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మార్చి 22 నుంచి ప్రారంభమైంది. ఈనెల 11వ తేదీ గడువు విధించారు. అర్హులైన బాలికలు 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

మండలంలో ఇలా..

మండల కేంద్రం గోనెగండ్లలో కేజీబీవీ పాఠశాల ఉంది. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీ వారీగా ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లలో సీట్లను భర్తీ చేస్తారు. ఒక్కో తరగతికి 40 సీట్ల చొప్పున కేటాయించారు. అలాగే ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు మాత్రమే ఉంటాయి. విద్యార్థినులు htpps:// apkgbv. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల చేయవచ్చు. ఎంపికైన వారికి ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది.

విద్యతో పాటు వృత్తివిద్యలో శిక్షణ

ఈ విద్యాలయంలో చేరిన బాలికలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం అందిస్తారు. మెరుగైన వైద్య సదుపాయం, వృత్తి విద్యలో శిక్షణ ఇస్తారు. చదువుతో పాటు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, నృత్యం, సంగీతం వంటివాటిని నేర్పిస్తారు. తరగతి గదుల్లో ఎల్‌సీడీ ప్రాజెక్టర్లు, డీవీడీ ప్లేయర్ల ద్వారా బోధన ఉంటుంది. ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

ఈనెల 11వ తేదీ వరకు గడువు



కేజీబీవీ పాఠశాలలో ఆరు, ఇంటర్‌లో చేరడానికి మార్చి 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రారంభం అయింది. ఈనెల 11వ తేదీన గడువు ముగుస్తుంది. అర్హులైన వారు ఇంకా దరఖాస్తు చేసుకోకుండా ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థునులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– విద్యావతి, కేజీబీవీ ఎస్ఓ, గోనెగండ్ల

భక్తిశ్రద్ధలతో ఆరాధన

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో పట్టాతీశ్వర రుద్రమునితాత ఆరాధన ఆదివారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. వేకువజామున శ్రీగణపతి పూజ, రుద్రమునితాతకు పాలాభిషేకం, రుద్రాభిషేకం, మహామంగళహారతి ఇచ్చారు. జె.హొసళ్లి గ్రామ పట్టదస్వామి మఠాధిపతి శ్రీ అజాత శంభులింగస్వామి గురూజీ పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, అభిషేకాలు, కుంకుమార్చన, బండారార్చన, మహామంగళహారతి తదితర పూజలు శాస్త్రోక్తకంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.